

సీఎం వైఎస్ జగన్‌తో సెల్ఫీ దిగుతున్న యువతి


సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి స్వాగతం పలికేందుకు బొకేతో ఎదురు చూస్తున్న గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య, ప్రత్తిపాడు ఎమ్మెల్యే సుచరిత


సీఎం వైఎస్ జగన్ కాన్వాయ్ ముందు సందడి చేస్తున్న యువత
- పట్నంబజార్, లక్ష్మీపురం

## క్లుప్తంగా

### వలంటీర్ల రాజీనామా

పొన్నూరు: మండలంలోని వడ్డిముక్కల, జడవల్లి గ్రామానికి చెందిన ఏడుగురు వలంటీర్లు ఎంపీడీఓ రత్నజ్యోతికి శుక్రవారం తమ రాజీనామా పత్రాలను అందజేశారు. వారితో పాటు మరో ఐదుగురు వలంటీర్లు రాజీనామా చేసినట్లు సమాచారం.

### పేదలకు కాళికామాత ఆలయ కమిటీ అన్నదానం



తెనాలి అర్బన్ : శ్రీ కాళికామాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివాజీ చౌక్‌లోని దేవస్థానం వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ గుమ్మడి రమేష్ మాట్లాడుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాలుగు సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి వై.శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు మేక సురేష్, కందేపి సీతారామయ్య, నీరంజన్, సుబ్బారావు, అడపాల శ్రీనివాసరావు, పి.రామకృష్ణ, సిహెచ్.హనుమంత్, పి.వెంకట్రావు, సుంకర రాజాబాబు, నక్కా వెంకటేశ్వర్లు, డాకా అంకిరెడ్డి పాల్గొన్నారు.

### భక్తిరస రాముని కీర్తనలకు హృద్యమైన నృత్యం



తెనాలి : పట్టణ నాజరుపేట కొల్లూరు వారి వీధిలో గల శ్రీసీతారామాంజనేయస్వామి దేవస్థానంలో శ్రీక్రోధి నామ సంవత్సరం ఆరంభమైన ఈనెల 9వ తేదీనుంచి 40వ వసంత నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుపుతున్నారు. శ్రీస్వామివారికి నిత్యార్చనలతోపాటు గాత్ర కచేరీలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, కోలాటాలు, పాటలు, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు.గురువారం రాత్రి కళ్యాణి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీచే కూచిపూడి నృత్య ప్రదర్శనలు జరిగాయి. అకాడమీ అధినేత, ప్రముఖ నృత్యగురువు డాక్టర్ చల్లా బాలత్రిపురసుందరి శిష్యబృందమైన 36 మంది చిన్నారులు వివిధ నృత్యాంశాలను ప్రదర్శించారు. అవన్నీ భక్తి రస రాముని కీర్తనలే కావటం విశేషం. చిన్నారుల నృత్యాభినయాన్ని భక్తులు, ఆలయ కమిటీ బాధ్యులు అభినందించారు.

### విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలి



కొల్లిపర : విద్యార్థులకు ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తమ బోధన అందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని, అలాంటి ఉపాధ్యాయులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంఈవో1 సాల్మాన్‌రాజు, ఎంఈవో2 ఝాన్సీలత అన్నారు. గతంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన పి.మృత్యుంజయరావు, షేక్ నూర్జహాన్ ను శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రంలో తోటి ఉపాధ్యాయులు సత్కార సభ నిర్వహించారు. ఈ సభలో ఎంఈవోలు పాల్గొన్ని వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో కుటుంబరెడ్డి , ఉపాధ్యాయులు కె.బెనహర్, రవితేజ, సదాలక్ష్మీ, దేవి, సుగుణకుమారి, బండి ప్రభుదాసు, కేదార్‌నాద్, సాయిబాబు పాల్గొన్నారు.

### ఒలింపియాడ్ విద్యార్థికి బంగారు పతకం ప్రదానం



తెనాలి అర్బన్ : క్రమశిక్షణతో కూడిన విద్యను అందరూ అలవాటు చేసుకోవాలని ఎంఈవో-1 మేకల లక్ష్మీనారాయణ సూచించారు. ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలంపియాడ్ పరీక్షల్లో గోల్డ్ మెడల్ సాధించిన పదో తరగతి విద్యార్థి పల్లెకొండ ఆనంద్‌కుమార్ అభినందన సభను చెంచుపేటలోని చైతన్య స్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. విద్యార్థికి మెడల్, సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.మాధురి, విద్యార్థి తండ్రి రవికుమార్, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

తెనాలి రూరల్ : నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో అధికారులు కేసు నమోదు చేశారు. తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం తెనాలి మండలం కొలకలూరు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఓ వ్యక్తి వద్ద 13 క్వార్టరు మద్యం సీసాలు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

# 'మేమంతా సిద్ధం'కు మేము సైతం

**ముఖ్యమంత్రి సభకు భారీగా తరలిన పార్టీ శ్రేణులు**

చేబ్రోలు: గుంటూరు సమీపంలోని ఏటుకూరులో జరిగిన మేమంతా సిద్ధం సభకు శుక్రవారం చేబ్రోలు మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన సభ, అనంతరం బుడంపాడు బైపాస్ వద్ద రోడ్ షోలకు మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాల ద్వారా అధిక సంఖ్యలో తరలివెళ్లారు. నారాకోడూరు గ్రామ సమీపంలో జడ్పీ వైస్ చైర్మన్ బత్తుల అనూరాధ, వేజండ్ల సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు ఇతర నాయకులు పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా తరలివెళ్లారు. నారాకోడూరు వద్ద మేమంతా సిద్ధం సభకు తరలివెళ్లే వారికి తాగునీరు, ఆహార సౌకర్యం ఏర్పాట్లు చేశారు.

**ఉత్సాహంగా సిద్ధం సభకు..**

పెదకాకాని: మేమంతా సిద్ధం సభను విజయవంతం చేసేందుకు పెదకాకాని మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు రూరల్ మండలంలోని ఏటుకూరు బైపాస్ వద్ద మేమంతా సిద్ధం సభకు వస్తుండటంతో అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు బస్సులు, ఆటోలు, బైక్‌లపై తరలి వెళ్ళారు. వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ సారధ్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు మేము సైతం మేమంతా సిద్ధం సభకు పార్టీ జెండాలు చేతపట్టి బయలుదేరారు.


చేబ్రోలులోని ముస్లిం ఏరియా నుంచి తరలివెళ్తున్న మహిళలు, యువకులు


ఏటుకూరు సభకు బయలు దేరిన బస్సు వద్ద గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి, తదితరులు


బహిరంగ సభకు తరలివెళ్తున్న బస్సుల వద్ద జడ్పీ వైస్ చైర్మన్ బత్తుల అనూరాధ, వేజండ్ల సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, నాయకులు


సుద్దపల్లి నుంచి గుంటూరు సభకు తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు

## కదం తొక్కిన చల్లావారిపాలెం, నల్లపాడు శ్రేణులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు సిద్ధం సభకు వెళుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి శుక్రవారం గుంటూరు రూరల్ మండలంలోని చల్లావారిపాలెం, నల్లపాడులలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని చల్లావారిపాలెం, నల్లపాడు గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మేమంతా సిద్ధం ఎన్నికల ప్రచార బహిరంగ సభకు ఆయా గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. 27వ డివిజన్ కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి, చల్లావారిపాలెం సర్పంచ్ ఆర్.సాంబశివారెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు దుగ్గెంపూడి యోగేశ్వరరెడ్డి, రూరల్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, నాయకులు మెట్టు వెంకటప్పారెడ్డి, ఎం.విజయభాస్కరరెడ్డి, డి.కిషోర్‌రెడ్డి, ఇంటూరి సాంబశివారెడ్డి, ఎల్.మల్లిఖార్జునరెడ్డిల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి క్రేన్‌ల ద్వారా భారీ పూలమాలను వేశారు. మహిళలు, కార్యకర్తలు విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బస్సు పైకి ఎక్కి అందరికీ ఆప్యాయంగా అభివాదం చేశారు.

## దారులన్నీ సిద్ధం సభ వైపే..


సభకు వెళ్తున్న వారికి దారిలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న పార్టీ నాయకులు

గుంటూరురూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు మేమంతా సిద్ధమంటూ ఏటుకూరు బైపాస్‌లో జరిగే మేమంతా సిద్ధం సభకు గ్రామగ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ అభిమానులు, ప్రజలు లక్షలాదిగా తరలివచ్చారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు నాయకులు స్వచ్ఛందంగా తమ అభిమాన నాయకుడిని చూసేందుకు, మాటలు వినేందుకు సిద్ధం సభకు చేరుకున్నారు. సిద్ధం సభకు వెళుతున్న ప్రజలకు దారిపొడవునా ప్రజలు మజ్జిగ ప్యాకెట్లు, మంచినీరు అందజేశారు. తమ అభిమాన నాయకుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డికి నీరాజనాలు పలికారు. జై జగన్, వన్స్‌మోర్ సీఎం, మాటిస్తే చేసి చూపిస్తాడంతే.. అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. పార్టీ నేతలు ఏర్పాటు చేసిన వాహనాల్లో స్వచ్ఛందంగా సభా ప్రాంగణానికి తరలిచ్చారు. యువకులైతే తమ ద్విచక్ర వాహనాలు, కార్లలో భారీ ర్యాలీలుగా తమంతట తాముగా సిద్ధమంటూ తరలిచ్చారు.

# వైఎస్సార్ సీపీ విజయం ఖాయం


బస్సులో కార్యకర్తలతో ప్రయాణించిన అంబటి మురళీకృష్ణ

- వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- సిద్ధం సభా స్థలం వరకు బస్సు నడిపి కార్యకర్తల్లో ఉత్సాహం నింపి...


బస్సు నడుపుతున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తిరుగులేని విజయం సాధించడం ఖాయమని, మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. ఏటుకూరు బైపాస్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొననున్న మేమంతా సిద్ధం సభకు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బస్సులు, కార్లలో భారీగా తరలివెళ్లారు. ఆయన పార్టీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. సభా స్థలం వరకు బస్సు నడిపి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. నియోజకవర్గం నుంచి 200 బస్సులు, 150 కార్లు, వెయ్యి బైకులతో సభకు తరలివెళ్లారు. ఈసందర్భంగా అంబటి మాట్లాడుతూ సీఎం సభకు ప్రజా స్పందన చూస్తుంటే, పొన్నూరులో వైఎస్సార్ సీపీ భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందనే విషయం స్పష్టంగా అర్థమవుతోందన్నారు. నియోజకవర్గంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే నరేంద్ర హయాంలో పాతికేళ్ల పాలనలో జరగని అభివృద్ధిని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసి చూపిందని చెప్పారు. గతంలో ఎవరికీ సాధ్యంకాని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్ అందించడంతో ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని తెలిపారు.

### లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

తెనాలిరూరల్: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగ పర్చుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, 6వ అదనపు జిల్లా న్యాయమూర్తి కేపీ బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. మే 11వ తేదీన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అవడం ద్వారా కక్షిదారులకు ఆర్థిక పరంగానూ వెసులుబాటు కలుగుతుందని, కోర్టుల్లో ఉన్న కేసులనూ రాజీ చేసుకోవచ్చని తెలిపారు. కేసుల లిటిగేషన్ విపరీతంగా పెరగడం వల్ల వాటిని పరిష్కరించే దిశగా లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సివిల్ కేసులు ఏ దశలో ఉన్నా పరిష్కరించుకోవచ్చని సూచించారు. రాజీ కాదగిన సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్, వాహనాలు, బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. ప్రజలందరూ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవచ్చన్నారు. స

### విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలి

కొల్లిపర : విద్యార్థులకు ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తమ బోధన అందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని, అలాంటి ఉపాధ్యాయులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంఈవో1 సాల్మాన్‌రాజు, ఎంఈవో2 ఝాన్సీలత అన్నారు. గతంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన పి.మృత్యుంజయరావు, షేక్ నూర్జహాన్‌ను శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రంలో తోటి ఉపాధ్యాయలు సత్కార సభ నిర్వహించారు. ఎంఈవోలు పాల్గొన్ని వారిని సత్కరించారు.

## దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ప్రభాకర్‌రెడ్డి, ఉమాకాంత్, తదితరులు

తెనాలి అర్బన్ : దోమల నియంత్రణపై ప్రజలకు అవగాహన పెంచుకోవాలని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మలేరియా విభాగం ఆధ్వర్యంలో బుర్రిపాలెం రోడ్డులోని హడ్కో కాలనీలో దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఇంటి పరిసరాల్లో ఉన్న పాత వస్తువుల్లోని నీటిని తొలగించాలని సూచించారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని చెప్పారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారులు శ్రీకంత ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో ఉన్న నీరు దోమలకు అవాసాలని తెలిపారు. దోమకాటు వల్ల విషజ్వరాలు, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గూన్యా, మెదడువాపు, బోధకాలు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాల చంద్రమౌళి, దీపాల శ్రీనివాసరావు, బందారు మల్లీశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## వెనిగండ్ల జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

- ఎంపీసీ గ్రూప్‌లో ఉత్తీర్ణత 78 శాతం, అత్యధిక మార్కులు 941
- బైపీసీ గ్రూపులో ఉత్తీర్ణత 75 శాతం, అత్యధిక మార్కులు 942

పెదకాకాని: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో వెనిగండ్ల శ్రీ వేమన జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న జూనియర్ బాలికల కళాశాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు నంబూరు తిరుపతిరావు, ఉపాధ్యాయుడు శ్యామల వెంకటరెడ్డిలు తెలిపారు. గత ఏడాది పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో జూనియర్ కళాశాల నిర్వహణకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిన సంగతి విధితమే. కళాశాల ప్రారంభంలోనే ఎంపీసీ గ్రూపులో 78 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

అలానే బైపీసీ గ్రూపులో 75 శాతం ఉత్తీర్ణులైనట్లు శుక్రవారం వారు తెలిపారు. ఎంపీసీ గ్రూపులో ఎ.లలిత 1000 మార్కులకు 941 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. అలానే బైపీసీలో ఒ.ఇందు 1000 మార్కులకు 942 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రధానోపాధ్యాయుడు నంబూరు తిరుపతిరావు, ఉపాధ్యాయులను, విద్యార్థులను గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు అభినందించారు.

## వణుకుడు వ్యాధికి జీజీహెచ్‌లో ఉచిత వైద్యసేవలు


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ అరుణ, వేదికపై డాక్టర్ బిందునర్మదా, డాక్టర్ రామకృష్ణ

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో వణుకుడు (పార్కిన్సన్స్) వ్యాధి లక్షణాలున్న రోగులకు సత్వరమే వైద్య సేవలు అందిస్తున్నట్లు న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణకుమారి తెలిపారు. న్యూరాలజీ సెమినార్ హాలులో శుక్రవారం వణుకుడుపై రోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తలనొప్పి, పక్షవాతం, మెదడుకు సంబంధించిన నరాల వ్యాధికి సంబంధం ఉంటుందన్నారు. కాలు, చేయి వణుకుతున్న విషయాన్ని గుర్తించి వెంటనే వైద్యుల్ని సంప్రదిస్తే చికిత్స అందిస్తామని తెలిపారు. నడకలో మార్పులు వస్తున్నట్లు గమనిస్తే వెంటనే నరాల వైద్యుల్ని సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. మందులు సకాలంలో వాడుకోవాలని, దానివల్ల వ్యాధి తీవ్రత తగ్గుతుందని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ బిందు నర్మద, డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

### కృష్ణానదిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణానది దిగువ ప్రాంతంలో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు కనుగొన్నారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ రమేష్ సంఘటనా స్థలానికి వెళ్లి నీటిలో వున్న మృతదేహాన్ని వెలికి తీశారు. ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ ఎవరో గుర్తుతెలియన మహిళ కనకదుర్గ వారధిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటుందని భావిస్తున్నామని, మృతురాలి వద్ద నుంచి ఎటువంటి వివరాలు లభించలేదని, మృతురాలి దేహంపై లైట్ బ్లూకలర్ చీర, పైన గోల్డ్ కలర్ అద్దగీతలు, ఎర్రపూలు ఉన్నాయని, ఒంటిపై రోల్డ్ గోల్డ్ చైన్, గాజులు, కమ్మెలు ధరించి ఉందన్నారు.



### రేపు కీళ్ల వ్యాధుల ఉచిత వైద్య సలహా శిబిరం

గుంటూరు మెడికల్: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ప్రతి నెలా రెండో ఆదివారం నిర్వహిస్తున్న స్పెషలిస్టుల ఉచిత వైద్య శిబిరంలో భాగంగా ఆదివారం కీళ్ల వ్యాధుల ఉచిత వైద్య సలహా శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయా సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి. సేవకుమార్, పావులూరి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు బ్రాడీపేట 2/1లోని ఎస్‌హెచ్ఓ భవనంలో నిర్వహించే సలహా శిబిరంలో రుమటాయిడ్ ఆర్థరైటిస్, గౌట్, లూపస్ ఎరత మేటస్, ఏక్లైల్లోజింగ్ స్పాండిలైటిస్, స్కైరో డెర్మ, ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలపై ప్రముఖ రుమటాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష రాజువరపు ప్రసంగంతో పాటు వైద్య సలహాలు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు.

### యువతి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: యువతి ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేళంగిణీనగర్ 7వ లైనుకు చెందిన మిరియాల ఝాన్సీరాణి (18) శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతికి కారణాలు తెలియలేదని పోలీసులు తెలిపారు.